విశ్రాంత ఉద్యోగులకు నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు 60 సంవత్సరాలుగా ఏపీ జెన్కో సంస్థ నందు పనిచేసి ఎన్నో సేవలు అందించిన విశ్రాంత ఉద్యోగులకు ఆలయ కమిటీ సభ్యులు అందరూ కలిసి ఘనంగా సాలువాతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఏపీ జెన్కో సంస్థ నందు విధులు నిర్వహించి ఇటీవల రిటైర్మెంట్ అయిన సందర్భంగా బివి రమణ దంపతులకు, భగవాన్ దంపతులకు ఘనంగా సన్మానించి అమ్మవారి ఫోటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సన్యాసి రావు, అప్పారావు, రమణ, సిహెచ్ నూకరాజు, ఈ.రమణ, సముద్రాలు, ఎర్రయ్య, రాము, కె.నూక రాజు, సిహెచ్ నాగ రాజు, మూర్తి , దేముడు, గ్రామస్తులు వీరందరూ కలిసి ఘనంగా వారిని సన్మానించారు.

ప్రజా సమస్యలకు అధికారులు పరిష్కారం కనుగొనాలి : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - రంపచోడవరం : వారం వారం గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి అర్జీ పెట్టుకొనే గిరిజనుల సమస్యలకు సంభంధిత అధికారులు తక్షణ పరిస్కారం కనుగొనాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఇరువురు కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్లోని 7మండలాలలో గిరిజనులకు సంబందించి వివిద రకాలైన సమస్యలకు సంభదించిన దరఖాస్తులను స్వీకరించి సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈవారం మొత్తం సుమారు 257దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. మారుమూల గ్రామాలకు సంబంధించిన రహదారుల సమస్యలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన సమస్యలు దరఖాస్తులు, భూ సమస్యల దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం మండలం రంప చోడవరం పంచాయతీ పరిధిలో గల సిరిగిందల పాడు ఆయకట్టు ద్వారా పందిరి మామిడి, ఇర్లపల్లి, జాగరంపల్లి గ్రామాలకు సంబంధించిన గిరిజన రైతులకు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే వారిని ప్రస్తుతము ఈ ఆయకట్టు పనిచేయడం లేదని మరమత్తులు చేయించి సాగునీరు ఏర్పాటు చేయాలని చవలం బాపన దొర, పంద చెల్లన్నదొర, కోసు రాజన్న దొర దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం జిఎం వలస పంచాయతీలోని డోలగండి, నెల్లూరు గ్రామాలకు సంబంధించిన ఏడు కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఉత్తలూరు గ్రామ ములో 5 కిలోమీటర్లకు బీటి రోడ్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా జిఎం వలస గ్రామ సచివాలయ భవనం పనులు పూర్తి చేయించాలని జీయం వలస సర్పంచ్ కారం లక్ష్మి,పల్లాల చిన్నారెడ్డి, మట్ల సుగ్గి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయాలని పుల్లంగి సర్పంచ్ వి. జార్జి బాబు దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి గ్రామంలోని శాంతినగర్కు కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని కనిగిరి దుర్గాప్రసాద్ దరఖాస్తు సమర్పించారు. గంగవరం మండలం లోని వివిధ గ్రామాలకు సంబంధించిన గిరిజన రైతుల సుమారు 500 ఎకరాలకు భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని, గంగవరం మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 30 బీటి రోడ్ల ఏర్పాటు చేయాలని అదేవిధంగా ఎండపల్లి గ్రామంలోని త్రాగునీటికి సంబంధించిన వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందని కొన్ని పనులు పూర్తికాక మధ్యలో అయిపోయిందని వెంటనే పనులు పూర్తి చేసి త్రాగునీరు ఏర్పాటు చేయాలని తీగల ప్రభ, కోసు బుల్లియమ్మ, సారపు సత్యవేణి దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం గడవకుర్తి పంచాయతీ పరిధిలో దోనెల పాలెం నుండి గొబ్బెల వరకు సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని అదేవిధంగా బోనంగి పాలెం లో స్కూలు, అంగన్వాడి కేంద్రానికి పక్క భవనాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ సావిరాల చంద్రుడు దరఖాస్తు సమర్పించారు.

అడ్డతీగల మండలం దాకోడు పంచాయి తీలోని ముల క్యాయల భీమవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, దాకోడు గ్రామం నుండి ముల క్యాయల భీమవరం వరకు మూడు కిలో మీటర్లకు బీటి రోడ్డు ఏర్పాటు చేయాలని పి. మల్లయ్య, యల్. సత్య నారాయణ, తమరాపు భాగ్యలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్య క్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, అంబేద్కర్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూర్య కుమారి, దోమ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం. శివయ్య, ఎయంఓసి. శ్రీహరి, జిల్లా అగ్రి కల్చరల్ అధికారి నందు, వెహికల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, జిసిసి డి యం. జి. పార్వతీశ్వం రావు, డిఎల్‌పిఓ రఘు నందన్, ఎడియం హెచ్ఓ జి.శిరీష, సర్వే ఇన్స్పెక్టర్ కె.దేవేం ద్రుడు, ఇఇ లు సుబ్బయ్య, ఎండి యూసఫ్, జి దేవిడ్ రాజ్, రవికుమార్,పి హెచ్ ఓ చిట్టిబాబు, రాజేంద్ర బాబు, సాయి సతీష్, తాసిల్దార్లు, ఎంపీడీవోలు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఎంపికయిన వారికీ పీవో ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - చింతూరు : చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించిన పండా ఆదిలక్ష్మి,అదే పాఠశాలకు చెందిన వి.వసుంధర లను మరియు కూనవరం ఏపీటిడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన బి.హర్షితలను, ఆశ్రమ పాఠశాల నరసింహా పురం నుండి పి.నవ్యలను, వారి యొక్క తల్లి తండ్రులను, ఉపాధ్యాయులను చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య విద్యార్థులను మరియు వారి యొక్క తల్లితండ్రులను ఐటిడిఏ కార్యాలయానికి పిలిపించుకొని అభినందనలు తెలియజేసి సెలెక్ట్ అయిన విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రెండు వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. తను కూడా ట్రిపుల్ ఐటిలోనే చదువుకొని ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్ హోదా లో ఉన్నా నని, మీరు కూడా మంచిగా చదువు కొని గొప్ప స్థాయికి ఎదగా లని ఆకాంక్షిం చారు. ట్రిపుల్ ఐటికి సెలెక్ట్ అయిన విద్యార్థుల యొక్క గురువులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ,ఉపాధ్యాయులు భద్రయ్య, రాజులు తదితరులు పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి

విశాలాంధ్ర - అనంతగిరి : మా టీచర్ మాకు కావాలి ప్రజా ప్రతినిదులు అధికారులు మా గోడు విన్నండి. పట్టించుకొండి. నిలదీసిన విద్యార్ధిని విద్యార్థులు 36 మంది విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ వెంకయ్యపాలేం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఉన్నది.పాఠశాల బాగానే నడుస్తుంది. గత ప్రభుత్వాల పుణ్యమా అని పాఠశాలలో గల విద్యార్థులకు చిలకలగెడ ఎలిమెంటరీ పాఠశాలలో మెర్జీ విలినం చేశారు. అరకు మెయిన్ రోడ్డు వెంకయ్యపాలేం నుండి చిలకలగెడ్డ రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లడం హైవేలో నిత్యం ఏక్సిడెంట్లు జరుగుతుండంతో భయభ్రాంతులకు గురి అయి చాలా మంది విద్యార్థులు పాఠశాల మానేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో చిలకలగెడ్డ పాఠశాలకు వెళ్ళలేక చిలకలగెడ్డ పాఠశాల భవనంలోనే విద్యార్థులు రోజు కూర్చోంటున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.ఇ.ఒకి ఫిర్యాదు చేశాము. మండల విద్యాశాఖ అధికారి ఫిర్యాదు చేసేమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకుడు కాకర సింగులు, గెమ్మెల. దేముడు, దానియేలు, పిల్లలా తల్లిదండ్రులు పిల్లలకు మద్దతుగా పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాబాయి దేశ్ముఖ్ జయంతి

విశాలాంధ్ర - గంగవరం : స్వాతంత్ర సమర యోధు రాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్ముఖ్ జయంతిని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా దుర్గాబాయి దేశ్ముఖ చిత్రపటానికి ఉపాధ్యాయులు ఉమాదేవి రాధాకుమారి గంగాభవాని లక్ష్మీ డిప్యూటీ వార్డెన్ లావణ్య , పాఠశాల ఏఎన్ఎం చల్లయ్యమ్మ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్ముఖ్ స్వతంత్ర ఉద్యమంలో చేసిన కార్యక్రమాలను విద్యార్థులకువివరించారు. 12 ఏళ్ల వయసులో ఆంగ్ల విద్య పై పోరాటం ప్రారంభించారన్నారు. మహాత్మా గాంధీ రాకను పురస్కరించుకొని 12 ఏళ్ల వయసులోనే విరాళాలు సేకరించారు అన్నారు.

జీపీఎస్ జీవో 54 కాఫీను దగ్ధం చేసిన యుటిఎఫ్

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : కూటమి ప్రభుత్వం జూలై 12వ తేదీన విడుదల చేసిన గజిట్ జీవో ఎంఎస్ నెంబర్ 54 ప్రతులను వెనక్కి తీసుకోవాలని, జిపిఎస్ ని రద్దు చేయాలని కోరుతూ నిరసనగా స్థానిక యుటిఎఫ్ నాయకులు సోమ వారం మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహం వద్ద జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కే రాజారావు, ఎస్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ఉద్యోగులపై ప్రభుత్వాల వైఖరి మారడం లేదని, గతంలో సిపిఎస్ రద్దు చేస్తానని వైసీపీ ప్రభుత్వం 20 అక్టోబర్ 2023 జిపిఎస్ ని తీసుకొచ్చి మోసం చేసిందన్నారు.ఇప్పుడు దానిని కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం జీవో నీ విడుదల చేయడం చాలా దారుణమని దీన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఇప్పటికే సిపిఎస్ పై 20 సంవత్సరాల పోరాటం జరుగుతున్నా ప్రభుత్వాల్లో దీనిపై సరైన నిర్ణయం తీసుకోకపోగా రకరకాల జీవోలతో కాలం వెళ్లదీస్తున్నారని వారు విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి సిపిఎస్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్ కన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ ,అధ్యక్షుడు కే రాజారావు, కార్యదర్శులు మేఘనాథ్ ,అప్పలస్వామి, శ్యాంసుందర్, యస్ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - అనంతగిరి : మండలం కాశీపట్నం పంచాయతీ సారవానిపాలేం గ్రామంలో జిల్లా పరిషత్ 15 ఆర్థిక సంఘం 3 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పనులు ప్రారంభంలో అతిథులుగా పాల్గొన్న అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ జిల్లా పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధులతో సారవానిపాలేం గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర గారి సహకారంతో అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు వర్షా కాలంలో బురదలు కూరుకు పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు సి.సి రోడ్ల నిర్మాణం వలన ప్రజలకు సమస్య పరిష్కారం అవుతుంది. ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జనరెడ్డి.లక్ష్మి, ఎంపిటిసి మూతిబోయిన సన్యాసిరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాగి.అప్పారావు మాజీ సర్పంచ్ దేముడు సిపిఎం పార్టీ మండల నాయకులు మామిడి.కృష్ణ, కాకర.సింగులు పెదబిడ్డ సర్పంచ్ సాలెపు.పెంటమ్మ పంచాయతీ రాజ్ ఏ.ఇ.సాయివిజయ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జన్ని సునీత, అగ్రికల్చర్ అసిస్టెంట్ దొరబాబు, మహిళా పోలీస్ ఉమామహేశ్వరి గ్రామ పెద్దలు చింతల చిన అప్పారావు దుమ్మిటి రాంబాబ చింతల జయరాజు కాకర పోలమ్మ కీసరి కృష్ణవేణి సింహాచలం చింతల సావిత్రి గ్రామస్తులు పాల్గొన్నరు

వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - గంగవరం : శనివారం నెల్లిపూడి ద్విచక్ర వాహనంతో కొట్టుకు పోయిన వ్యక్తి మృత దేహాన్ని సోమ వారం స్థానిక పోలీసులు గుర్తిం చారు. లభ్యమైన మృతదేహాన్ని గొర గుమ్మి గ్రామానికి చెందిన లోత మోహన్‌రావు ధని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర - సీతంపేట : ఐటీడీఏ లో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక గ్రీవెన్స్ లో పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఏజెన్సీలో వర్షాకాలంలో త్రాగునీరు కలుషితమై అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరుతున్నారని పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించి మందులు సప్లై చేయాలన్నారు అదే విధంగా అత్యవసర మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు ఇంటర్ విద్యార్థులకు తగినన్ని సీట్లు లేక చదువుకు దూరం అవుతున్నారని ఏజెన్సీలో ఇంటర్ కళాశాలలో సీట్లు పెంచాలని అన్నారు మన్యంలో రహదారులు త్రాగునీరు, విద్య, వైద్యం, సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఐటిడి ఏ పరిధిలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో టెట్, డిఈడి కోచింగ్ ఐటిడిఏ పరిధిలో ఇవ్వాలన్నారు.

శివ్వాం దళితులను కొట్టిన పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలి

- శివ్వాం దళితుల భూములు దళితులకు ఇవ్వాలి
- కలక్టర్ కార్యాలయం ముందు శివ్వాం దళితుల భూ సమస్యపై రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర - బెలగాం : శివ్వాం దళితులను కొట్టిన పెత్తందారులు అరెస్ట్ చేయాలని, దళితుల భూములు దళితులకు ఇవ్వాలని, జిల్లాలో గిరిజనులు, దళితులు, పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలను రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి ప్రారంభించారు. నిరాహారదీక్ష శిబిరానికి ఎఐసిటియు జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు 1970 సంవత్సరంలో శివ్వాం రెవిన్యూ సర్వే నెంబర్ 20 నుండి 30 వరకు 14 మందికి 22 ఎకరాల 80 సెంట్ల భూమిని డి పట్టాలిచ్చారని అప్పటినుంచి దళితులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. శివ్వాం గ్రామంలో కొంతమంది పెత్తందారులకు ఆ భూమిపై కన్ను పడిందని ఆ భూమిని ఎలాగైనా లాగేయాలని దళితులకు ఇచ్చిన భూముల సర్వే నెంబర్లకు సంబంధం లేకుండా సర్వే నెంబరు 102లో హద్దులు వేసి ఫేక్ ఇంజక్షన్ ఆర్డర్ కోర్టు వారిని తప్పు పట్టించి తీసుకువచ్చారని అప్పటినుండి రెవెన్యూ వారు పోలీస్ వారు శివ్వాంలో ఉన్న దళితులను భూమి మీదకి వెళ్ళొద్దని దౌర్జన్యం చేశారన్నారు. గతంలో దళితులు సాగు చేసి వరిచేలు కల్లాలకి తెచ్చుకున్నవి మళ్లీ పోలీసు వారు రెవెన్యూ వారు దగ్గరుండి పెత్తందారులకు అప్పచెప్పారని, ఇది చాలా దుర్మార్గమని అన్నారు. దళితులకు డి పట్టాలిచ్చిన సర్వేనెంబర్ 20 నుండి 30 వరకు 22 ఎకరాలు 80 సెంట్లు భూమికి పెత్తందారులు తీసుకొచ్చిన సర్వేనెంబర్ 102 భూమికి సుమారు మూడు పర్లాంగుల దూరం ఉంటుందని సర్వే నెంబరు ఒక దగ్గర అయితే హద్దులు ఇంకో దగ్గర చూపించి తీసుకొచ్చారన్నారు. ఈ సంవత్సరం దళితులు నారిపోసి వరి నాట్లు వేయడానికి నారు సిద్ధం చేస్తుండగా పెత్తందార్లు వచ్చి దాడి చేసి ఐదుగురు దళితుల్ని గాయపరిచారని తిట్టి కొట్టారని దానిపై పాలకొండ డిఎస్పీ విచారణ చేశారని, కానీ ఇంతవరకు ఒక్క పెత్తందారుని కూడా అరెస్ట్ చేయలేదని వెంటనే దళితులను కొట్టి తిట్టిన పెట్టాందార్లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండల తాహసిల్దారు పెత్తం దారులు ఎటువంటి హక్కులు చూపించకపోయినా, దళితుల వద్ద డి పట్టాలు వన్ బి అడంగల్ ఫెయిర్ అడంగల్ అన్నిటిలో పేర్లు నమోదై ఉన్నా ఇంకా తాత్సారం చేస్తూ పెత్తందారులకు అమ్ముడుపోతున్నారని కాబట్టి రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇవే కాకుండా మన్యం జిల్లాలో అటు పాచిపెంట నుండి భామిని వరకు గిరిజన ప్రాంతంలో గాని మైదాన ప్రాంతంలో గాని గిరిజనులు దళితులు పేదల భూములు గత 50 సంవత్సరాలుగా అన్యాక్రాంతం అవుతున్నాయని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని ఈ అన్యాక్రాంతమైన భూములు అన్నిటిని సర్వే చేసి వెంటనే పేదలకు అప్పజెప్పాలని కోరారు. అనేక మంది గిరిజనులు, దళితులు, పేదలు ప్రభుత్వ బంజరు భూములను జిల్లాలో సాగు చేస్తున్నారని, కొండపోడు భూములు తరతరాలుగా గిరిజనులు సాగు చేస్తున్నారని వీటికి పట్టాలు ఇవ్వాలని, శివ్వాం దళితులను కొట్టిన పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని, శివ్వాం దళితులకు భూమి అప్పజెప్పాలని, జిల్లాలో పేదలు గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు అన్నింటికీ డి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు టి. జీవన్న, సింహాద్రి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై. మన్మధ రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, బి వెంకటరమణ, బి. సూరిబాబు పాలమెట్ట రాము తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : వాతావరణంలోని మార్పులు కారణంగా గత కొన్ని రోజులుగా గిరిజన ప్రాంతాల్లో జ్వరాలు విజృంబిస్తున్నాయి. ఈ కారణంగా సోమవారం గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపీడీవో ఆఫీస్ వద్ద వివిధ శాఖలకు చెందిన అధికారులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ వర్షాలు, వాతావరణం లో మార్పులు కారణంగా ఏ గ్రామాన్ని తొంగి చూసినా జ్వర పీడితులే దర్శనమిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడుతుంది. జ్వరాలు బారిన పడిన రోగుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంది. ఇందులో అధిక మంది చిన్నారులే కనిపిస్తున్నారు. ఆశ్రయిస్తున్న రోగుల్లో టైఫాయిడ్, మలేరియా, వంటి లక్షణాలతో ఆసుపత్రిలో చేరుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యి తగు జాగ్రత్తలు తీసుకొని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ కాచిన వేడి నీరు, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని ప్రజలకు మరియు విద్యార్థులకు తెలియజేయాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ రమేష్ బాబు, వెలుగు ఏపిఎం ఆదయ్య, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ చంద్రశేఖర్, మరియు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



విశాలాంధ్ర - వీరఘట్టం : మండలం పరిధిలోనే చిట్టిపూడి వలస గ్రామానికి చెందిన జక్కు కృష్ణ (65) సోమవారం పొల ములో పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఎప్పట్లాగే సోమ వారం ఉదయం ఇంటి వద్ద అల్పా హారం తీసుకొని పొలంలో పనిచేసేందుకు వచ్చి పని చేస్తుండగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడ కుప్పకూలి పడిపోవడంతో సమీప పంట పొలాల్లో పనిచేస్తున్న రైతులు కుప్పకూలిన జక్కు కృష్ణ వద్దకు వచ్చి పరిశీలించిగా అప్పటికే మృతి చెంది ఉన్నాడని గుర్తించి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలంకు చేరుకొని మృత దేహాన్ని తరలించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిజాయితీ చాటిచెప్పిన ఆర్టీసీ కండక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.డి. ప్రసాద్ తన నిజాయితీని చాటుకున్నాడు. విశాఖపట్నం నుంచి పార్వతీపురం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు ఒక బ్యాగును మర్చిపోయారు.ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆ బ్యాగును తీసుకొని డిపో మేనేజర్ కనకదుర్గకు అప్పగించాడు. బ్యాగును తెరిచి చూడగా అందులో ముదుతులాల బంగారం పుస్తెలతాడు, దుస్తులు ఉన్నాయి. అనంతరం డిపో మేనేజర్ ఆ బ్యాగును ప్రయాణికులకు అందజేశారు.నిజాయితీ చాటుకున్న కండక్టర్ ప్రసాద్ కు డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న విద్యార్థుల యొక్క కాస్మోటిక్, మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ పరిష్కారం కోసం జులై 20 నుండి 30వరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ నిద్రలు చేపట్టడం జరుగుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గ్రహాల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గత ఏడు సంవత్సరాల నుండి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని మండిపడ్డారు.2023 సంవత్సరం నవంబర్ నెల నుండి మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా విడుదల చేయకపోవడం వలన హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు నాణ్యమైన సరుకులతో కూడిన భోజనాన్ని అందించలేకపోతున్నారని వాపోయారు .జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని. అనేకమార్లు జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా కనీసం ఆ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించకుంటే జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ముట్టడికి పిలుపిస్తామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి : జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



విశాలాంధ్ర - సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. వైద్యులపై నమ్మకంతో ప్రజలు వస్తారని వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన అన్నారు. ఆసుపత్రి మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వచ్చే గిరిజనులకు సరైన మార్గదర్శకం, సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన చెప్పారు. మందులు అన్ని సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతుందని వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రేయింబవళ్ళు మంచి సేవలు అందాలని ఆయన సూచించారు. సేవలలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వివి రమణ, ఐటిడిఏ ఏపిఓ చినబాబు, ఆసుపత్రి సూపరింటెంట్ బి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో వేడుకగా రథయాత్ర...

విశాలాంధ్ర - వీరఘట్టం : వీరఘట్టం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర కనుల వైభవంగా సోమవారం నిర్వహించారు వీరఘట్టం మండల పరిధిలో అనేకమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు లింగరాజ ప్రసాద్ రథో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదములను పంచిపెట్టారు ఎటువంటి అసౌకర్యము భక్తులకు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో మురలీకృష్ణ ఆధ్వర్యంలో వీరఘట్టం పట్టణ పోలీస్ వారు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర
పేజీ : 2
అల్లూరి సీతారామరాజు - పార్వతీపురం మన్యం
మంగళవారం 16, జూలై 2024

కుక్క కాటుకు తీవ్రంగా గాయపడిన బాలుడు

విశాలాంధ్ర - చింతపల్లి : కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడిన గిరిజన బాలునికి వైద్యం అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మణిదీప్ అన్నారు. వైద్యాధికారి మణిదీప్ ప్రాథమికంగా అందించిన సమాచారం ప్రకారం జీకే విధి మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ చెక్కల మద్ది గ్రామానికి చెందిన గిరిజన బాలుడు పాతుని తేజ్వల్(7) సోమవారం కుక్క కాటుకు గురయ్యాడని, కుక్క తీవ్రంగా గాయ పరచడంతో కుటుంబ సభ్యులు హుటా హుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు రావడంతో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని,. ఆ బాలునికి చింతపల్లి ఆసుపత్రిలో సూప రింటెండెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారి అజయ్ మెరుగైన వైద్యం అందిస్తున్నారని ఆయన వివరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు అధికార యంత్రాంగం చేర్చాలి

విశాలాంధ్ర - గరుగుబిల్లి : కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి మండల పరిష త్తు అభివృద్ధి కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా శాసనసభ్యులు జగదీశ్వరి మాట్లా డుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చే బాధ్యత అధికార యంత్రాంగం పైఉందని ఈసంద ర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరి దిశ నిర్దేశం చేశారు. అదేవిధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో మండలానికి సంబంధించి వరి విత్తనాలు ఎంత మేర పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎరువులు ఎంత మేర తెప్పించారో వివరాలు తెలియ జేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని రేగిడి విజయభారతికి ఎమ్మెల్యే అడిగారు . ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎరువులు, ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రగతిని ఎమ్మెల్యేకి వివరించారు. అదే విధముగా శివ్వాం పంచాయతీ పరిధిలోని సీమనవానివలస, దత్తివలస, కారివలస గ్రామాల్లోని మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు గురయ్యాయని వర్షాలు కురిసిన సమయంలో తరగతులు విద్యార్థులకు తరగ తులు నిర్వహించలేని పరిస్థితులు ఉన్నాయని నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనా రాయణ (సత్తిబాబు)తో పాటు, ఎంఈఓ నాగభూషణరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రావి వలస, గరుగుబిల్లి , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నైట్ వాచ్ మెన్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులు డాక్టర్ కె కార్తీక్, డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్ లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈసమీక్ష సమావేశంలో ఎంపీడీవో పైల సూర్యనారాయణ, మండల తహసిల్దార్ కె.జయ, విద్యుత్ శాఖ ఏఈ బొంతాడ శంకర్రావు, ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), కోట భరత్ కుమార్ (సుమన్), మరడాన సింహాచ లంనాయుడు, సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు (రాంబాబు), రౌతు గోవిందనాయుడు, బోను చంద్రి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయ కులు మర్రాపు పురుషోత్తం నాయుడు, అక్కేన మధుసూదనరావు, ఎడ్ల శ్రీనువాసరావు, ముదిలిబాబు విజయవాంకుసం, నల్ల తిరుపతి నాయుడు, బొచ్చ జగదీష్, తది తరులు పాల్గొన్నారు.

బిల్ల బంధను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పట్టణ ప్రాంతంలో ఉన్న బిళ్ళ బందను ఆక్రమించి అక్రమ లేఅవుట్లు వేసి అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌరుష సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మూడు నాలుగు వార్డుల పరిధిలో ఉన్న సౌందర్య నారాయణమూర్తి నగర్ లే అవుట్ ప్రక్కన మున్సిపాలిటీ వారి అనుమతులు లేకుండా ప్రభుత్వ బంధను, గోర్జిని సుమారు ఎకరా 70 సెంట్లు ప్రభుత్వ భూమిని పలువురు ఆక్రమించి అమ్మకాలు చేపడుతున్నారని, ఈ విషయంపై పలు దినపత్రికల్లో వార్తలు వెలువడినప్పటికీ రెవిన్యూ మున్సిపల్ అధికారులు నేటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. అనుమతులు లేని లేఅవుట్‌ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని కావున ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ప్రభుత్వ బంధను, గోర్జిని ఆక్రమించి అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జీపీఎస్ విధానం సరికాదు : పీఆర్టీయూ

విశాలాంధ్ర - బెలగాం : విజయవాడ స్వాతంత్రయ సమరయోధుల భవనంలో జరిగిన పిఆర్టియు రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఓపిఎస్ సరి సమానమైనది ఏదీ కాదని రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వానికి పీఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అధ్యక్షతన గిరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ శాసన మండలి సభ్యులు గాదె శ్రీవాసులు నాయుడును మరలా ఉత్తరాంధ్ర శాసన మండలికి పోటీ చేయుటకు అనుమతినిస్తూ రాష్ట్ర సంఘం నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జిఓ 117 ను రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, నూతన పిఆర్సి అమలుకు ముందు మధ్యంతర భృతి 20 శాతంకు తగ్గకుండా ఇవ్వాలని, అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ఇవ్వాలని, డిఎస్సీ 2003 కు చెందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని తదితర అనేక సమస్యల సాధనకు తీర్మానం చేయడం జరిగిందని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్ తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు బెవర రాజగోపాల్, మక్కా సాంబమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు

విశాలాంధ్ర - గంగవరం : సోమవారం నిర్వహించిన రంపచోడవరం నియోజకవర్గం ఐటీడీఏ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్,ఐటిడిఏ పిఓ ఎమ్మెల్యేకూ గంగవరం మండల పలు సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తీగల ప్రభ ఒక ప్రకటనలో తెలిపారు. భూపతిపాలెం రిజర్వా యర్ కెనాల్ నుండి గంగవరం మండలంలో గల కొన్ని గ్రామాలకు సాగునీరుగా ఇవ్వాలని అలాగే ఖరీఫ్ మరియు రబీ పంటలకు సకాలంలో సాగునీరు అందించాలని అలాగే ఎండపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ నుండి త్రాగునీరు సకాలంలో అందించాలనిఅలాగే రోడ్డు సమస్యల గురించి అలాగే గంగవరం మండలంలో 30 బీటీ రోడ్లు పైగా ఉన్నాయి అవి త్వరితగతిన పూర్తి చేయడం కోసం గంగవరం టు ఎండపల్లి ఈ రామ వరం నుండి జడేరు సెంటర్ వరకు సగం పనులు అయిన రోడ్లను పూర్తిస్థాయిలో చేయడానికి కన్సల్ డిపార్ట్మెంట్ వారికి చెప్పడానికి ఎమ్మెల్యే వారికి జిల్లా కలెక్టర్ వారికి పిఓ గారికి వినతి పత్రాలు ఇవ్వ డం జరిగినది.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ అధ్యక్షుడు పాము అర్జున, తెలుగుదేశం నాయకులు సారపు సత్యవేణి, నర్సి సూరమ్మ, దాని సీతమ్మ, ముర్రం చిన్న నరసన్న దొర, ముర్రం పండు దొర, మడకం సత్తిబాబు దొర, రేవుల అబ్బాయి రెడ్డి, కోటం లక్ష్మణ్,మడకం వెంకటరమణ, మడకం శ్రీరాములు, కుంజం రమేష్, మడకం బుల్లబ్బాయి దొర పాల్గొన్నారు.

నేరస్తుడిపై పోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర - సీతంపేట : ఈనెల 12వ తేదిన మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో 17 ఏండ్ల మైనర్ బాలిక అదృశ్యం అయినట్లు, తే. 13.07.2024 ది న సాయంత్రం 19.00 గంటల సమయంలో తన అక్క ఇచ్చిన రిపోర్ట్ మేరకు సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ జగదీష్ నాయుడు కేసు నమోదు చేయగా, ఆ తరువాత రోజు అనగా 14.07.2024 న, అదృశ్యం అయిన అమ్మాయి సీతంపేట పోలీస్ స్టేషన్ కి వచ్చి, తనపైన మిస్సింగ్ కేసు నమోదు విషయం తెలుసుకొన్న తరువాత, ఎలా మిస్ అయ్యావని సీతంపేట ఎస్సై అడుగగా, హైదరాబాద్ లో ఉద్యోగం ఇప్పిస్తానని విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో గల గచ్చలవలస గ్రామానికి చెందిన ఎస్టి ఎరుకుల కులానికి చెందిన గొర్లె సింహాచలం యోగేంద్ర అనే వ్యక్తి తనను మోసం చేసి, విశాఖపట్నం లో ఒక గదిలో పెట్టి పలుదఫాలుగా మానభంగం చేసి, చేతులతో కొట్టి, గాయపర్చినట్లు తెలియపర్చగా, ఈ కేసు పోక్సో గా మార్చి, పాలకొండ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, జి.వి. కృష్ణారావు దర్యాప్తును ప్రారంభించి ముద్దాయి కోసం గాలిస్తున్నారు.

ప్రాధమిక వైద్యం వికటించి యువకుడు మృతి

విశాలాంధ్ర - కురుపాం : జ్వరం, విరేచనాలుతో బాధపడుతున్న యువకుడుకు అందించిన ప్రాథమిక వైద్యం వికటించి అపస్మారక స్థితికి వెళ్ళడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం మెరుగైన వైద్యం కోసం తరలిస్తున్న సమయం లో మృత్యుఒడిని చేరిన సంఘటన మండలంలోని గుమ్మలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళితే గుమ్మ గ్రామానికి చెందిన లాభాల సాయి క్రిష్ణా(చింటూ)(32) రెండు రోజులు గా జ్వరం తో బాధపడుతుండగా గుమ్మ లక్ష్మి పురంకి చెందిన ప్రైవేటు వైద్యులు వైద్య సేవలు అందించారు.ఆదివారం విరేచనాలు కూడా కావడంతో సిలైన్ ఎక్కిస్తున్నా సమయం లో అపస్మారక స్థితి కి సాయికృష్ణ వెళ్ళిడంతో సదరు ప్రైవేటు వైద్యులు శ్రీకాకుళం అత్యవసర వైద్యం కోసం తీసుకుని వెళ్ళ వలసిందిగా సూచించారు. శ్రీకాకుళం తరలిస్తున్న సమయం లో మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పో యారని కుటుంబ సభ్యులు తెలిపారు.సాయిక్రిష్ణ మరణానికి గల కారణాలు ప్రభుత్వ వైద్య సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు సిఆర్పిలకు ఉంది.

వాటర్ ట్యాంక్, మరుగుదొడ్ల నిర్మాణాల తనిఖీ

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - జీకే వీధి : మండలంలోని రింతాడ పంచా యతీ నేలపాడు గ్రామంలో అసంపూర్తి వాటర్ ట్యాంకు మరుగుదొడ్డి నిర్మా ణాలపై విశాలాంధ్ర అం దించిన కథనానికి స్పందిస్తూ జీ.కే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, రింతాడ పంచాయితీ డి.డి.ఓ అరుణ్, కార్యదర్శులు సోమేశ్ సూర్య ప్రకాష్ సోమవారం తనిఖీ నిర్వహించారు. గ్రామస్తులు పేర్కొన్నట్టుగా వాటర్ ట్యాంక్ వల్ల కలుషితమవుతుందనేది అవాస్తవని అది కేవలం నీటిని నిలువ చేసి,బట్టలు ఉతుక్కునే ట్యాంక్ అని నిర్ధా రించారు. మరుగుదొడ్ల నిర్మించే ఐదేళ్లు అవుతున్నందున డోర్లు ఊడాయని తెలిపారు.ఈ గ్రామానికి గతంలో ఆర్.డబ్ల్యు.ఎస్ నిధుల ద్వారా మంచినీటి ట్యాంకు నిర్మాణాం చేపట్టేమని ఆర్ డబ్ల్యు ఎస్ జే.ఈ భగవంత రావు తెలిపారని, మంచినీటి సమ స్యలు తీర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ..మహిళ మృతి

విశాలాంధ్ర - హుకుంపేట : మండలంలొ గల గడుగుపల్లి వద్ద సోమవారం ఉదయం 10 గంటల సమ యంలో జరిగిన ఆటో బోల్తా ఘటనలో ఓల్డా పంచాయితీ జాంకారం పుట్టు గ్రామానికి చెందిన అంగన్ వాడీ టీచర్ బద్నైని కళావతి 45 అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి అంగన్ వాడి టీచర్ రెండో కుమార్తెకు పాడేరు బాలికల ఏపీ ఆర్ పాఠశాల లో సీటు రావడం తో పాఠశాలలో జాయినింగ్ నిమిత్తం అంగన్ వాడి భర్త మోహన్ కుమార్తె ఆటో డ్రైవర్ తో పాటు నలుగురు ప్రయాణిస్తున్న ఆటో గడుగుపల్లి కు రాగానే ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా అదుపుతప్పి బోల్తా పడగ అంగన్ వాడి టీచర్ తలకు బలమైన దెబ్బ తగలగా సంఘట స్థలంలో ఉన్న స్థానికులు 108 అంబులెన్స్ లో ఎక్కించి చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించాయి. మండల వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావు, సీఐటీయూ మండల కార్యదర్శి అప్పల కొండ పడాల్‌లు కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలిపారు. అంగన్ వాడీ టీచర్ మృతికి కుటుంబానికి తీరని లోటని వారన్నారు.

భద్రగిరి పిటిజి పాఠశాల సందర్శన

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి పిటిజి పాఠశాలను కురుపం నియోజకవర్గం ఎమ్మెల్యే తోక జగదీశ్వరి సందర్శించారు. ఆమెను విద్యార్థులు నృత్యంతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఆమె విద్యార్థులు యొక్క వసతి, పరిసరాలు, మెనూ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కృష్ణ బాబు, కళావతి, రాష్ట్ర అధ్యక్షులు టిఆర్ఎఫ్ రోబ్బా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ 154 జీవోను రద్దు చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి : ఈరోజు అనంతగిరి మండల కేంద్రంలో అనంతగిరి యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు 154. జిపిఎస్ జిఓ ను రద్దు చేయాలని పాత పెన్షన్ విధానం ను పునరుద్దరించాలని నిరసన కార్యక్రమం చేసి 154. జీవో ప్రతులను దగ్ధం చేయడమైనది. సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ పునరుద్దరించాలని డిమాండ్ చేయడమైనది ఈ కార్యక్రమం లో అల్లూరి సీతారామరాజు జిల్లా జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్య దర్శి పి దేముడు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పూర్వ సహ అధ్యక్షులు ఎస్ రాంబాబు అనంతగిరి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.వి ఈశ్వరరావు బిడ్డ సింహచలం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎన్.మల్లేశ్వరరావు బి.విజయకుమార్ జెదేముడు మరియు కార్యవర్గ సభ్యులు పంచాడి రామచందోర్ రావు జోగి గంగులు మొదలగు వారు పాల్గొనడమైనది.

ఆరోపణలు రుజువైతే రాధను విధుల నుండి తొలగిస్తాం : ఐసిడియస్ పిడి ఎంఎన్ రాణి

విశాలాంధ్ర : సాలూరు : పట్టణంలో రామాకాలనీ అంగన్‌వాడీ కేంద్రం లో కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్న బలగ రాధ పై వచ్చిన ఆరోపణలు నిజమని నిర్ధరాణ అయితే ఉద్యోగం నుండి తొలగిస్తామని ఐసిడియస్ పిడి రాణి అన్నారు. సోమవారం స్థానిక ఐసిడియస్ ప్రాజెక్ట్ ఆఫీస్ లో ప్రాజెక్ట్ పరిధిలోని కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల బలగ రాధ వ్యవహారశైలిపై వెంకటేశ్వర కాలనీకి చెందిన కార్యకర్తలు ఎం.విజయలక్ష్మి, కె.భారతిలు మహిళా శిశుసంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి. సంధ్యారాణి కి వినతిపత్రం అందజేయడమే కాకుండా సాలూరు పట్టణ స్టేషను లో పిర్యాదు చేశారు. ఈ విషయం పత్రికలలో రావడం తో ఉన్నతాధికారులు విచారణ చేప ట్టేందుకు సిద్దమయ్యారు.అందులో భాగంగా పిడి రాణి సోమవారం సాలూరు వైటీసీ లో సాలూరు ప్రాజెక్టు కార్తకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా రాధపై వచ్చిన ఆరోపణలపై 7 అంశాలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని కార్తకర్తలకి ఇచ్చి జవాబులు రాయమన్నారు. ప్రతీ కార్యకర్త జవాబులు రాసి అందజేశారు.అంగన్‌వాడీ కార్యకర్తలు స్వచ్ఛంద సంస్థలు పేరిట సంఘాలను ఏర్పాటు చేసి సెటిల్మెంట్ వ్యవహారాలు నడు పవచ్చా అని విలేఖరులు అడుగగా ప్రభుత్వం నుండి జీతం లేదా గౌరవవేతనం పొందే వారెవరూ ఉద్యోగ సంఘాలను తప్ప వేరే సంఘాలను నడుపుటకు వీలులేదన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధి కారులకు అందజేస్తానన్నారు.వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆరోపణలు రుజువైతే విధులనుండి రాధను తొలగిస్తామని తెలిపారు.ఈ కార్య క్రమంలో సిడిపిఓ సత్యవతి, సూపర్వైజర్లు ఆమె వెంట ఉన్నారు.

విచారణ తీరుపై పలు అనుమానాలు

ఇదిలా ఉండగా ఐసిడియస్ ఉన్నతాధి కారులకు ముడుపులు చెల్లించాలనే నెపంతో బలగరాధ డబ్బులు వసూలు చేస్తుందని కార్యకర్తలు పిర్యాదు చేశారు.అంతేకాకుండా కార్యకర్తలకు ఇచ్చిన ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు కూడా ఉన్నతాధికారుల పేరిట వసూలు చేసిందా లేదా అని అడిగారు.ఇటువంటి సమయంలో ఐసిడియస్ అధికారులతో విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వచ్చే పరిస్థితి ఉండదు.ఎందుకంటే ఉన్నతా ధికారుల పేరిట వసూలు చేశారన్న విషయాన్ని ఐసిడియస్ వారు సమర్ధించరు. ఒకవేళ సమర్ధిస్తే ఎవరి వాటా ఎంత అనేది బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి ఐసిడియస్ అధికారులతో కాకుండా ఇతర డిపార్ట్మెంట్ వారితో విచారణ చేపడితే వాస్తవాలు బయటపడతాయని పేరు చెప్పడానికి ఇష్టపడని కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

అర్హులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - రంపచోడవరం : పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన అర్హులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుపరిచే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరిగిందిని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎయస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన బాధితులతో జిల్లా కలెక్టర్ వారితొ పాటు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనం సమావేశం నిర్వహించారు. ముందుగా పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ముంపు బాధితులకు లాండ్ లాండ్, డి పట్టాలకు నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ కాలనీలలో బాతురుములు ఏర్పాటు చేయాలని, 18 సంవత్సరాల నిండిన వారికి ఆం ఆర్ ప్యాకేజీ అమలు తదితర సమస్యలు కలెక్టర్ వారి దృష్టికి ముంపు బాధితులు తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన పోలవరం ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయుటకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో 44 గ్రామాలు పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవడం జరిగిందని ఆయన తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. గిరిజనేతరులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చాలా వరకు అమలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ల్యాండ్ టు ల్యాండ్ సమస్యలు కూడా పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ కాలనీలకు పంచాయతీలుగా తీర్చిదిద్దాలని నా దృష్టికి కొంత మంది తీసుకురావడం జరిగిందని పంచాయతీలుగా ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. డి పట్టాలకు ప్యాకేజీ అమలు చేయమని బాధితులు కోరడం జరిగిందని ఈ సమస్యపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్యలు ఇక నుండి ఇక్కడే పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో యస్ డిసిలు అంబేద్కర్, మమ్మీ, తాసిల్దారులు చలపతిరావు, సులోచన, డిప్యూటీ తాసిల్దారులు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

వరదలపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - ఎటపాక : రాబోవు వరదల దృష్ట్యా సమీక్షా సమావేశం ఎటపాక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వచించారు. ఈ సంధర్బంగా తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ మొరలి కృష్ణ మాట్లా డుతూ రానున్న వరదల ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మండలములో గోదావరి వరదలు 38 అడుగులు వస్తే మండలములో 11 గ్రామాలు ముంపునకు గురవుతాయని, 53 అడుగులు వేస్తే 28 గ్రామాలు ముంపునకు గురవుతయాన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 12 బోట్లు అందుబాటులొ ఉన్నాయని, నిత్యావసర సరుకులు, ఉన్నాయన్నారు. ఏటపాకలో మూడు కేంద్రాలలో బియ్యం నిల్వలు ఉంచామన్నారు వరద ముంపు . గ్రామ పంచాయతీ లో సహాయ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సెక్టార్ అధికారి గా తహశీల్దార్, మొబైల్ అధికారిగా ఎంపిడివో , జోనల్ అధికారులుగా ఎంఎవో రాజులు, ఏవో రాబిన్, అర్ డబ్లూ ఎస్ ఏఈ సత్యం లను సంప్రదించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 30 ట్రాక్టర్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిదులు, అధికారులు సమన్వయంతో సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.
సమాచారం కొరకు కంట్రోల్ రోమ్ లు ఏర్పాటు చేశామన్నారు.

కన్నుల పండువగా జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర

విశాలాంధ్ర - ముంచింగ్‌పుట్టు : ఆలూరి జిల్లా ముంచింగి పుట్ట మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ లో గల కొండపడ గ్రామంలో సోమవారం శ్రీ జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర కన్నుల పండుగగా రంగ రంగ వైభవంగా జరిగింది. చోటముక్కిపుట్ నుంచి కొండపడ గ్రామం వరకు రథం పూరేగింపు జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఎంతో భక్తి శ్రద్ధలతో భజన పాటలతో దింసా నృత్యాలతో భక్తులు జగ న్నాథుడి రథయాత్ర నిర్వహించారు. చోటముక్కి పుట్టు నుంచి కొండపడ గ్రామం వరకు రద యాత్ర కొనసాగింది. రథం లాగేందుకు మండలంలోని నలుమూలల నుంచి అధిక సంఖ్య లో భక్తులు తరలి వచ్చి రథయాత్ర లో పాల్గొ న్నారు. అలాగే దారెల పంచాయతీ కేంద్రంలో జగన్నాథుడి రథయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక శివాలయం నుంచి జగన్నాథ స్వామి ఆలయం వరకు ఊరేగించారు. అధిక సంఖ్యలో సరిహద్దు ప్రాంతం భక్తులు తరలి వచ్చారు. రథం లాగేందుకు భక్తులు ఒకరినొకరు పోటీ పడ్డారు. అంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాడువా జోలపుట్ మాచ్ ఖండ్ గ్రామాల ప్రజల సైతం రథయాత్రలో పాల్గొన్నారు

మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురకు గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన సిరిపురం ఉపేంద్ర నవజ్యోతి ఛానెల్ టివి రిపోర్టర్ గా పనిచేస్తున్నాడు. మోటార్ సైకిల్ పై వైకెఎం కాలనీకి తన స్నేహితుడు బొంగు శ్రీధర్ ను తీసుకొని మోటార్ సైకిల్ పై వెళు న్నారు. పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన బండి అజయ్ మోటార్ సైకిల్ పై పార్వతీపురం వైపు వస్తున్నాడు. మార్గ మద్యలో వెంకంపేట గోలీలు దాటిన తరువాత వాటర్ ప్లాంట్ ఎదురుగా మెయిన్ రోడ్డు వద్దకు వచ్చే సరికి ఎదురెదురుగా వస్తూ ఒకరినొకరు ఢీ కొట్టారు. ఈసంఘటనలో ముగ్గురకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గిరిశిఖర గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - కురుపాం : రహదారి, తాగునీరు, విద్యా, వైద్యం లేని గిరిశిఖర గ్రామాల్లో కనీస మౌలిక వసతులను ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్పించాలని గిరిజన సంఘం నాయకులు ఆరిక గంగారావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో వలస బల్లేరు పంచాయతీ పరిధిలోగల బొడ్డడిగూడ,చాపరాయి గూడ, డోకులు గూడా తదితర గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోతులు మాయమైన రాళ్ల తేలిన రహదారి వద్ద చేపలు పడుతూ నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా గిరిజనుల తలరాతలు మారడం లేదని , అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉన్నాయని నియోజకవర్గంలో ఎందరో కేంద్ర, రాష్ట్రస్థాయిలో మంత్రి పదవులు చేపట్టారు కానీ కనీస సౌకర్యాలు లేకపోవడం చాలా బాధాకరమని ఐదేళ్ల క్రితం బొడ్డడిగూడ, చాపరాయి గూడ, డోకులు గూడా గ్రామాలకు అరకోరాగా రోడ్డు వేసి చేతులు దులుపుకున్నార పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రజల కష్టాలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం తరఫున డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు బి.నగేష్, బి.వెంకటేష్, ఎ.రాజు కుమార్ గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

స్థానిక వనరులు ఉపయోగించి పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - సీతపేట : సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వి వి రమణలతో కలసి ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వినతులను సోమవారం స్వీక రించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ కమ్యూనిటీ ఆధారిత అవసరాలపై ఎక్కువ అర్జీలు అందుకున్నట్లు చెప్పారు. సిసి రోడ్లు, రక్షణ గోడలకు వినతులు ఎక్కువగా ఉన్నాయని వాటితో పాటు ఆసుపత్రి సేవలు, ఎన్ఆర్ఇజిఎస్ పనులు తదితరాలు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. పనులను పూర్తి చేయడానికి, గ్రామ స్థాయి వనరులు మరియు ప్రజల సేవలను వినియోగించు కోవాలని తద్వారా పనులు త్వరగా కార్యరూపం దాల్చుతాయని ఆయన తెలిపారు. ఇంజి నీరింగ్ పనులన్నింటినీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ లకు వెళ్లేందుకు కూపన్లు జారీ చేసేందుకు గ్రీవెన్స్ వద్ద సదరం కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. టెట్, డిఎడ్, బిఎడ్ అభ్యర్థులకు కోచింగ్ ఇచ్చుటకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి శిక్షణ ఇవ్వ వచ్చని తెలిపారు. సంతలు వద్ద విశ్రాంతి స్థలాలను, విద్యుత్ దీపాలు , తాగు నీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, సీతంపేట, కుసిమి నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. విద్యార్థికి పాఠ్యాంశాల్లో హ్యాండ్ వాష్‌ను భాగం చేయాలనీ, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. డిప్యూటీ డీఈవో వాటిని పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. పాఠశాలల్లో పనితీరు ఆధారిత సూచిక ఉండాలని సూచించారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం, బరువు తక్కువగా ఉండ కూడదని, ఐసీడీఎస్ పర్యవేక్షణ చేయాలని సూచించారు.సీతంపేట మండలం సామరెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేని కారణంగా పక్క పంచాయితీ తుంబకొండ గ్రామానికి పిల్లలు ఆటో, బస్సు ద్వారా ప్రయాణం చేస్తున్నారని, బస్సు రాని రోజు స్కూలుకి వెళ్లలేకపోతున్నారని గ్రామానికి ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని ఎం. ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు వినతి అందించారు,ఎచ్చర్లలో శ్రీ వెంకటేశ్వర కాలేజ్ లో డిప్లొమా చదివానని, అధికమైన ఫీజుల వల్ల చదువు మధ్యలో ఆపేయడం జరిగిందని, కాలేజ్ వారిని టీ సి తిరిగి ఇవ్వమంటే 50వేలు కట్టమంటున్నారని, ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, దయజేసి న్యాయం చేయాలని సంకిలి మండలం నుండిసవర బిరాజి దరఖాస్తు చేశారు. సీతంపేట పంచాయితీలో సుమారుగా 40 సంవత్సరముల క్రితము ఎస్టి కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మించారు. అది ప్రస్తుతము శిధిలావస్థ చేరుకుంది. వాటర్ ట్యాంక్ ను మంజూరు చేయాలని కోరుతూ ఆరిక కళావతి దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచా యతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పి.డి.రామ చంద్రరావు జిల్లా ప్రణాళికా అధికారి పి.వీర రాజు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, డి.ఆర్.డి.ఏ పి.డి వై. సత్యం నాయుడు, జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి ఎం వి ఆర్ కృష్ణాజీ, ఈఈ సింహాచలం, ఐటీడీఏ ఏపిఓ జి చినబాబు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.